నేడు మాస శివరాత్రి పూజలు

సనత్‌నగర్: భాద్రపద మాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా సోమవారం సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనునన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు రుద్రహోమం, సాయంత్రం 6.30 గంటల (ప్రదోష కాలం) సమయంలో అభిషేకం, ప్రత్యేక అలంకరణ జరుగుతాయని పేర్కొన్నారు.

తల్లి పాల బ్యాంకింగ్‌పై అంతర్జాతీయ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న ఆర్‌వీ కర్ణన్

అమీర్‌పేట: తల్లిపాలివ్వడం, నిర్వహణ తల్లి పాల బ్యాంకింగ్ అనే అంశంపై 2024 దక్షిణాసియా లాంబ్యాస్ 4వ అంతర్జాతీయ సదస్సు ఆదివారం అమీర్‌పేట మారీ గోల్డ్ హోటల్‌లో జరిగింది. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఆర్.వి.కర్ణన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో మొట్టమొదటి మానవ పాల బ్యాంక్ నీలోఫర్‌లో ఏర్పాటు చేశామని, చనుపాలివ్వడం నిర్వహణ దేశంలోనే అత్యుత్తమ నమూనా అని ఆయన అన్నారు. తెలంగాణ,ఆంధ్ర,కర్నాటక రాష్ట్రాల యూనిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ ప్రతినిధి డాక్టర్ జెలలెం బిర్హాను టఫెస్సే తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రండి



తలసానికి ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న మహంకాళి ఆలయ ఈఓ మనోహర్

సనత్‌నగర్: వచ్చే నెల మూడో తేదీ ఉంచి 12వ తేదీ వరకు నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవస్థానం ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వానం పలికారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సనత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా కృషి చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బన్సీలాల్‌పేట న్యూబోయిగూడలో గొల్లకొమరయ్య కాలనీలో జరుగుతున్న పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు ఓయూలో స్వర్ణోత్సవ సభ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 సంవత్సరాలు అవుతోంది. ఈ సందర్భంగా సోమవారం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 12 గంటలకు స్వర్ణోత్సవ సభ నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్ తెలిపారు. ఫ్లెక్సీలు, స్వాగత తోరణలతో ఓయూ క్యాంపస్ ఎరుపెక్కింది.

సీతారాం ఏచూరి యువతకు స్ఫూర్తి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి నేటి యువతకు స్ఫూర్తి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమానికి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి అధ్యక్షత వహించగా మాజీ ఎమ్మెల్సీ ప్రొ.నాగేశ్వర్, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎస్.వీరయ్య, ఓయూ అధ్యాపకులు కొండ నాగేశ్వర్, రామ్ షపర్డ్, అమంచి నాగేశ్వర్, నాగరాజు, అశోక్ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్ ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించి మాట్లాడారు.

కుల గణనతోనే దేశప్రగతి

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోని అన్ని సామాజిక వర్గాలు, వారి వాస్తవ స్థితిగతుల లెక్కలను శాస్త్రీయంగా చేపట్టి ఆ దిశగా చర్యలు చేపట్టినప్పుడే అంతరాలు లేని సమాజ నిర్మాణం జరుగుతుందని సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ జాతీయ కన్వీనర్ డాక్టర్ అనిల్ జైహింద్ అన్నారు. ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్ లో జరిగిన కుల గణన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ బిసి ఉద్యోగుల ఫెడరేషన్ నిర్వహించింది. కార్యక్రమానికి ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు దేవల సమ్మయ్య సభాధ్యక్షత వహించారు. ప్రధాన వక్తలుగా బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, జస్టిస్ బి చంద్రకుమార్ ,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న , ప్రొఫెసర్ కె మురళీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ... రాజ్యాంగంలో అన్ని వర్గాలకు సమానమైన హక్కులు కల్పించాలని స్పష్టంగా ఉందన్నారు. అయినప్పటికీ పాలకుల నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి కారణంగా దేశంలో వివక్షత, అణిచివేత, పేదరికం పెరుగుతుందన్నారు.

భయం.. భయం..!

శిథిలావస్థలో పురాతన భవనాలు • ప్రమాదపుటంచున లష్కర్



సికింద్రాబాద్ మోండా ప్రాంతంలో వ్యాపారాలకు నిలయంగా ఉన్న ఓ పురాతన భవనం

సికింద్రాబాద్: వర్షాకాలం వచ్చిందంటే చాలు చిలకలగూడ, సెకండ్‌బజార్, గ్యాస్‌మండి, మోండా మార్కెట్ ఇలా ఏటా ఒక ప్రాంతంలో పురాతన భవనాలు నేలకూలడం, శకలాలు విరిగిపడడం, ప్రహరీగోడలు పడిపోవడం పరిపాటిగా మారింది. ఇటువంటి సందర్భాల్లో కొన్ని సంఘటనల్లో ఆస్తినష్టం, ఇంకొన్ని సంఘటనల్లో ప్రాణ నష్టం సంభవించడం రివాజైంది. భారీ వర్షాలు కురిస్తే చాలు సికింద్రాబాద్ ప్రాంతంలో పురాతన భవనాల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు.

- మంగళవారం సికింద్రాబాద్ ప్రాంతంలోని ఓల్డ్‌జైలుఖానా భవనం ప్రహరీగోడ ఉన్నఫలంగా నేలమట్టం కావడంతో మళ్లీ మున్సిపల్ అధికారులు శిథిల భవనాలకు సంబంధించి సమీక్ష చేస్తున్నారు.
- శిథిలావస్థకు చేరిన భవనాలు ఒకటి రెండు నేలమట్టం అవుతున్నా సికింద్రాబాద్‌లో మాత్రమే ఉరుకులు పరుగులు పెడుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు ఒకటి రెండు భవనాలను నేలమట్టంచేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తరువాత ప్రమాదకరంగా పరిణమిస్తున్న పురాతన భవనాల స్థితిగతులను సమీక్షించేవారే కరువయ్యారు.

ఆది నుంచీ నిర్లక్ష్యమే...

జీహెచ్‌ఎంసీ ఉమ్మడి సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో మూడు వందలకు పైగా పురాతన భవనాలు ఉన్నాయి. ఇందులో మోండా ప్రాంతంలోనే ప్రమాదకర పరిస్థితికి చేరిన పురాతన భవనాలు ఉండడం గమనార్హం. మొత్తంగా 200 భవనాల పరిస్థితి ప్రమాదకరంగా, మరో 120 భవనాల పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్టు అధికారుల నివేదికలు చెబుతున్నాయి.

- పురాతన భవనాలను తొలగించడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఆది నుంచీ నిర్లక్ష్యవైఖరిని అవలంబిస్తూన్నరు.

నామమాత్రపు చర్యలు...

అత్యంత ప్రమాదకర పరిస్థితుల జాబితాలో చేరిన సుమారు వంద వరకు భవనాలను నేలమట్టం చేయాలని ప్రతీ ఏడు జీహెచ్‌ఎంసీ అధికారులు నివేదిక రూపొందించుకుంటున్నారు.

- ఆ మీదట భవనాలు ఖాళీ చేయాలని యజమానులను, అద్దె దారులకు నోటీసులు ఇస్తున్నారు. ఆరువాత సాంకేతిక సమస్యల సాకుతో పురాతన భవనాలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.
- భవనాలు నేలమట్టం అయి ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతున్న సందర్భాల్లో మాత్రమే ఒకటి రెండు భవనాలను కూలివేసి చేతులు దులుపుకుంటున్నారు.
- దీంతో పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు నేలమట్టం అవుతాయో తెలియని పరిస్థితిలో ఉన్న పురాతన భవనాల పరిసర ప్రాంతాల ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.
- తాజాగా సంభవించిన ఓల్డ్ జైలుఖానా ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన జీహెచ్‌ఎంసీ అధికారులు పురాతన, శిథిల భవనాలకు సంబంధించి మళ్లీ సమీక్ష చేస్తున్నారు. కఠిన చర్యలు తీసుకునేందుకు సమాయత్తం అవుతుండడం కొనమెరుపు.

నిజాం కాలపు నిర్మాణాలు....

స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం నవాబుల పాలనలో సికింద్రాబాద్ ప్రాంతంలో నిర్మించిన పురాతన భవనాలు వందలసంఖ్యలో ఉన్నాయి. అందులో కొన్నింటికి మాత్రమే ఆయా భవనాల యజమానులు ఎప్పటికప్పుడు మరమ్మత్తు పనులు చేయించుకుంటున్నారు.

- ఎక్కువ సంఖ్యలోని పురాతన భవనాలు మొత్తంగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా పరిణమించాయి.
- గత్యంతరం లేని పరిస్థితిలో పలు కుటుంబాల వారు అవే భవనాల్లో జీవిస్తుండగా, మరి కొన్ని ఇవే తరహా భవనాల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాలు కొనసాగిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: స్వచ్ఛందసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు ఉపయోగించుకోవాలని చేసుకోవాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. ఆదివారం కార్ఖాన లాలాషా దర్గా సహకారంతో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పేదలకు వైద్య సేవలు అందించేందుకు మెడికవర్ ఆసుపత్రి చేస్తున్న సేవ కార్యక్రమాలు అభినందనీయ మని ప్రశంసించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు జమీల్ ఖాన్, మీర్జా, జావీద్ మజర్, అశ్రాఫ్ ముప్పిడి మధుకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

6న రెడ్డి ప్రజాప్రతినిధులకు సన్మానం



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో అక్టోబర్ 6 న రెడ్డి ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించనున్నట్లు జాక్ చైర్మన్, కో చైర్మన్‌లు రామ్‌రెడ్డి, పైళ్ల హరినాథ్‌రెడ్డిలు తెలిపారు. రాష్ట్రంలోని రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లకు హైటెక్ సిటీలోని శిల్పారామంలో సన్మానిస్తామని వారు చెప్పారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, నరెడ్డి రవీందర్‌రెడ్డి, బొక్క శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెక్‌కాలనీలో 2 నుంచి బతుకమ్మ సంబురాలు



సనత్‌నగర్: జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 10వ తేదీ వరకు బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కాలనీ రెండో రోడ్డులో చింతిరెడ్డి అనంతరెడ్డి నివాసంలో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభతో కలిసి ప్రధాన కార్యదర్శి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ వివరాలను వెల్లడించారు. 2న అనంతరెడ్డి బంగ్లా వద్ద, 3న రోడ్డు నెంబర్-3లోని వైష్ణవి సన్‌రైజ్ అపార్ట్‌మెంట్, 4న వాసవీ సెంట్రల్ కోర్టు, 5న రోడ్డునెంబర్-1లోని వాసవీ ఇంద్రప్రస్థ, 6న నార్త్‌స్ట్రీట్‌లోని వనమాల రెసిడెన్సీ , 8న రోడ్డునెంబర్-3లోని ఐకాన్ అపార్ట్‌మెంట్స్, 10న గురువారం సాయంత్రం 6 గంటలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు కొనసాగుతాయన్నారు. అందమైన బతుకమ్మలను పేర్చిన మహిళలకు న్యాయనిర్ణేతల సమక్షంలో ఎంపిక చేసి తొలి ఐదుగురికి పట్టుచీరలను, పాల్గొన్న వారందరికీ ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు.

రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు జరగాలి

సనత్‌నగర్: బీజేపీ సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకుని రికార్డు స్థాయిలో సభ్యత్వాల స్వీకరణే లక్ష్యంగా ముందుకుసాగాలని ఆ పార్టీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. బీజేపీ ఇంటింటి మెంబర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం ఆయన సనత్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ వద్ద జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు లబ్దిదారులకు ఊతంగా నిలుస్తున్నాయన్నారు. ప్రపంచ దేశాలు నేడు భారత్‌వైపు ఆసక్తిగా చూస్తున్నాయంటే మోదీ పరిపాలనే కారణమన్నారు. రానున్న కాలంలో తెలంగాణలో సైతం బీజేపీ సర్కార్ వచ్చేలా సభ్యత్వ నమోదు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ మహబూబ్‌కాలేజ్ హాల్‌లో బీజేపీ మహంకాళి-సికింద్రాబాద్ జిల్లాలో జరుగుతున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సభ్యత్వ నమోదుపై వేగం పెంచాలని, అన్ని జిల్లాల కంటే ఈ జిల్లాలో అత్యధిక సభ్యత్వ నమోదు జరగాలని సూచించారు. సీనియర్ నేతలు వెల్లాల రామ్మోహన్, జయశ్రీ పాల్గొన్నారు.

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి పలు ప్రాంతాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజల చేత పార్టీ సభ్యత్వాన్ని చేయించారు. బీజేపీ నాయకులు ఎం. శ్రీనివాస్ అధ్వర్యంలో పలువురు నాయకులు జయనగర్ కాలనీ, కీస్ బ్లాక్, ఐడిహెచ్ కాలనీల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు

సనత్‌నగర్: ఉద్యోగ నిర్వహణలో అంకితభావం , నిబద్ధతతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంతో పాటు గోల్కొండ తదితర దేవాలయాలకు కార్యనిర్వాహణాధికారిగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన శ్రీనివాసరాజు దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. హనుమాన్ దేవాలయం అర్చకులు, సిబ్బంది వారిని శాలువాలు, గజమాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, హనుమాన్ దేవాలయం ముఖ్య అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులతో పాటు ప్రాంగణంలోని 16 ఆలయాల అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న స్థానికులు, అర్చకులు

మంత్రి ఉత్తమ్‌కుమార్ తండ్రికి తలసాని నివాళి



సనత్‌నగర్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి మృతి పట్ల మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సంతాపం తెలిపారు. కొండాపూర్‌లోని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లి పురుషోత్తంరెడ్డి పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు.



మార్కెట్‌లోకి ఎంజీ విండ్సర్ ఎలక్ట్రిక్ వాహనం

రాంగోపాల్‌పేట్: ఎంజీ విండ్సర్ మొట్టమొదటి ఇంటెలిజెంట్ సీయూవీ కారును ఆదివారం ఎంజీ రోడ్డులోని ఎంజీ మోటర్స్‌లో ఎంటీ వైబ్రెంట్ మొబిలిటీ గ్రూపు ఆధ్వర్యంలో మార్కెట్‌లోకి విడుదల చేశారు. ప్రముఖ షూటర్ కినాన్ చినాయ్, నటీ సీరత్ కపూర్, సీరియల్ నటుడు మానస్‌లు ఈ వాహనాన్ని విడుదల చేశారు. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్స్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతీందర్ సింగ్ బజ్వా మాట్లాడుతూ ఎంటీ విండ్సర్ ఎక్స్‌షోరూమ్ ధరలు రూ.13,49,800 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు.

'హీరో' బండి కనిపిస్తే చోరీ

- ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్
- 18 టూవీలర్స్ స్వాధీనం



మీడియా సమావేశంలో డీసీపీ బాలస్వామి, పోలీస్ అధికారులు (వృత్తంలో నిందితులు)

చిలకలగూడ : అతని కన్ను పడిదంటే పార్కింగ్ చేసిన వాహనం క్షణాల్లో అక్కడి నుంచి మాయమౌతుంది. హీరో సంస్థకు చెందిన వాహనాలంటే భలేమోజు. దొంగిలించిన 18 టూవీలర్స్‌లో 16 ఆ సంస్థకు చెందినవే కావడం గమనార్హం. నగరంలోని పలు ప్రధాన ఆస్పత్రులు, మెట్రోస్టేషన్లను టార్గెట్ చేసుకుని ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితునితోపాటు, కొనుగోలు చేసిన మరో ముగ్గురిని అరెస్ట్ చేసిన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. చిలకలగూడ ఠాణా ప్రాంగణంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ, అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డిలు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయిజిల్లా పరిగి గ్రామానికి చెందిన కే. శ్రీనివాస్ (35) మద్యం, గంజాయికి అలవాటు పడ్డాడు. కూలి డబ్బులు సరిపోక కుటుంబ పోషణ భారమైంది. సులభంగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాలు చోరీ బాట పట్టాడు. నగరంలోని గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఈఎస్ఐ, మెదక్ ప్రభుత్వ ఆస్పత్రి, మియాపూర్, బాలానగర్, మెట్టుగూడ మెట్రోస్టేషన్లను టార్గెట్ చేసుకుని పార్కింగ్ చేసిన టూవీలర్స్‌ను చోరీ చేసి తక్కువ డబ్బులకు విక్రయించి జల్సాలు చేయసాగాడు. చిలకలగూడ, నాంపల్లి, ఎస్‌ఆర్ నగర్, అఫ్జల్‌గంజ్, మెదక్, మియాపూర్, లాలాగూడ, కూకట్‌పల్లి జూబ్లీహిల్స్, ఘటకేసర్ ఠాణా పరిధిలో మొత్తం 18 టూవీలర్స్‌ను చోరీ చేశాడు.

పట్టుబడ్డాడు ఇలా..

చిలకలగూడ ఠాణా పరిధిలోని గాంధీఆస్పత్రిలో ఇటీవల పార్కింగ్ చేసిన వాహనాలు మాయం అవుతున్నట్లు పలు ఫిర్యాదులు అందాయి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, డీఎస్ఐ ఆంజనేయులు, క్రైమ్ సిబ్బంది సీసీ కెమెరాల పుటేజీలను రోజుల తరబడి పరిశీలించి చోరీ చేస్తున్నది శ్రీనివాస్‌గా గుర్తించారు. స్థానికుల సహాయంతో శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. హీరో సంస్థకు చెందిన వాహనాలు సెకెండ్‌హ్యాండ్‌లో సులభంగా విక్రయించవచ్చేని, అందుకే వాటిపైనే దృష్టి పెట్టానని వివరించారు. నిందితునితోపాటు చోరీ చేసిన వాహనాలు కొనుగోలు చేసిన చర్లపల్లి ఆర్‌టీసీ కాలనీకి చెందిన బెజవాడ ఏసురత్నం (38), బెజవాడ శాంతరావు (28), రంగారెడ్డి జిల్లా నాగారం యువశక్తినగర్‌కు చెందిన ఆనంగి శ్రీను (32)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, చోరీ చేసిన 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

క్రైమ్ సిబ్బందికి రివార్డులు

పది పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన టూవీలర్ చోరీ కేసులను చేధించిన చిలకలగూడ క్రైమ్ అధికారులు, సిబ్బందికి ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి నగదు ప్రోత్సాహక బహుమతులు, రివార్డులు అందించి అభినందించారు. చిలకలగూడ డీఐ రమేష్‌గౌడ్, డీఎస్ఐ ఆంజనేయులు, క్రైమ్ కానిస్టేబుళ్లు నవీన్‌కుమార్, జగదీష్, షేక్‌మజర్‌బాషా, గణేష్, విజయ్‌కుమార్, కృష్ణ, హోంగార్డులు ప్రమోద్, కృష్ణ, నరేష్‌ల రివార్డులు అందుకున్నారు.

ఒత్తిడి లేని జీవితాన్ని గడపండి

కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్ కార్డియాలజీ హెచ్‌ఓడీ శ్రీధర్



వేడుకల్లో ఓసీటీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: ప్రతిరోజూ 30 నిమిషాల పాటు వ్యాయామంతో పాటు పౌష్టికాహారం తీసుకుంటూ ఒత్తిడి లేని జవితం గడిపితే గుండె సంబంధ సమస్యల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని కిమ్స్-సన్‌షైన్ హాస్పటల్ కార్డియాలజీ హెచ్‌ఓడీ, కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి తెలిపారు. వరల్డ్ హార్ట్ డే వేడుకలను బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ హాస్పటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ కస్తూరి రాసిన ఓసీటీ (వన్ పోర్టల్ వేవ్ దే కెన్ యాక్సిస్ ఏ టు జెడ్) పేరిట ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులకు ఉపయోగపడే ప్రొసీజర్ లిటరేచర్ పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్ కస్తూరి మాట్లాడుతూ కార్డియోవాస్కులర్ డిసీజ్ కారణంగా ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 20.5 మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. చెడు ఆహారపు అలవాట్ల కారణంగా ఆరు మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయని, ప్రతి ఒక్కరి జీవితంలో డైట్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం కార్డియాలజీ విభాగంలో పనిచేసే సీనియర్ వైద్యులను కిమ్స్‌హాస్పటల్ సీఓఓ సుధాకర్‌జాదో ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో జీఎం చందర్ తదితరులు పాల్గొన్నారు.